batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
12 ఆగస్టు 2026
బుధవారం




02

## నైట్రాప్ కలిపిన
# విస్కీతో హత్య...!

### వెంకటేశం మృతి కేసును ఛేదించిన పోలీసులు

### రాజకీయ కోణంలోనూ దర్యాప్తు

### నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ

సిరిసిల్ల, బతుకమ్మ :సిరిసిల్ల పట్టణానికి చెందిన వెంగల వెంకటేశం (50) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. నైట్రాప్ అనే విషపదార్థాన్ని విస్కీలో కలిపి వెంకటేశానికి తాగించి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో సిరిసిల్ల బీవై నగర్‌కు చెందిన కుసుమ గణేష్ (51) ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. తారకరామానగర్‌కు చెందిన వెంకటేశం ఆగస్టు 6న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి సుమారు 9 గంటలకు ఆయన భార్య వెంగల సులోచన సిరిసిల్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. వెంకటేశం కనిపించకుండా పోయిన రోజున అతనితో కలిసి తిరిగిన కుసుమ గణేష్‌ను గుర్తించారు. ఆగస్టు 8న ఉదయం సుమారు 11.15 గంటలకు రగుడు శివారు ప్రాంతంలో వెంకటేశం మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభించింది. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఎల్లమ్మ చౌక్ వద్ద కుసుమ గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దాని ప్రకారం వెంకటేశం కొంతకాలంగా గణేష్ వద్ద పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. తరచూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పనికి గైర్హాజరు కావడం, పని మధ్యలోనే వెళ్లిపోవడంతో గణేష్ అతడిని పని నుంచి తొలగిస్తానని చెప్పేవాడని పేర్కొన్నారు.




02

## పత్తి కొనుగోళ్లలో
# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

హైదరాబాద్, బతుకమ్మ :రానున్న 2026--27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి నిర్లక్ష్యం కారణంగా మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. “మనం బతకాలంటే రైతు బతకాలి” అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతుల్లో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని ఈ సీజన్‌లో లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026--27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

# తగలబడిన స్కూల్ బస్

### పిల్లలును కాపాడిన స్థానికులు

వెబ్ డెస్క్, బతుకమ్మ :రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం తప్పింది. 25 మంది పాఠశాల విద్యార్థులతో ఉదయం ప్రయాణిస్తున్న ఓ స్కూల్ బస్సు నడుస్తుండగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సులో ఉన్న చిన్నారులు భయంతో కేకలు వేయడంతో సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు వెంటనే స్పందించారు.

02





# అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మదన్ మోహన్

02

## మహంకాళి అమ్మవారికి
# మారు బోనం సమర్పించిన కొండా సురేఖ

సికింద్రాబాద్, బతుకమ్మ :ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మంగళవారం మారు బోనం సమర్పించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, ఆలయ అర్చకులు డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఘన స్వాగతంపలికారు. అనంతరం మంత్రి కొండా సురేఖ ఉజ్జయిని మహంకాళిఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో జరిగిన మారు బోనం సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమ్మవారికి మారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



02

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఈ సీజన్‌కు లాంగ్ స్టేపుల్ కాటన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 ఎంఎస్ పి పెరిగిందని చెప్పారు.ప్రతి అర్హత కలిగిన రైతుకు ఎంఎస్ పీ ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు ఎంఎస్ పి కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా ఎల్ 1 నుంచి ఎల్ 12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, మార్కెట్‌కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలని అన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతు ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్లు ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుల్ బార్‌కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పంట బుకింగ్ డేటాను ఎన్ఐసీ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు అత్యంత వేగంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి, దానికంటే అధిక దిగుబడి పొందిన రైతులకు ఏఈఓ ల ద్వారా డిజిటల్ యీల్డ్ సర్టిఫికెట్స్ వెంటనే జారీ చేయాలని మంత్రి సూచించారు. దీనివల్ల అధిక దిగుబడి సాధించిన రైతుల పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని అన్నారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే ప్రధాన జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో స్టెపుల్ లెంగ్త్, మైక్రోనెయిర్, తేమశాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని చెప్పారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీ లు తప్పనిసరిగా పనిచేసేలా చూడటంతో పాటు బరువు కొలిచే యంత్రాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎంఎస్ పీ పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రైతు నేస్తం, గ్రామస్థాయి కార్యక్రమాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఎంఎస్ పీ, కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలని చెప్పారు. ప్రతి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డెడికేటెడ్ హెల్ప్‌డెస్క్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ లేదా పెండింగ్ ఏర్పడినప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రస్థాయి కమిటీ, జిల్లాస్థాయి కమిటీలు, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, సీసీఐ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. "రైతుకు ఎంఎస్ పీ అందించడమే ప్రధాన లక్ష్యం. ఈ విషయంలో ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే తీవ్రంగా పరిగణిస్తాం. పత్తి కొనుగోళ్లలో రైతులకు నష్టం కలిగించే చర్యలు, అవకతవకలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అన్ని శాఖలు, రాష్ట్ర మరియు జిల్లాసాయి కమిటీలు, సీసీఐ అధికారులు సమిష్టి బాధ్యతతో పనిచేసి ప్రతి రైతుకు ఎంఎస్ పీ ప్రయోజనం అందేలా చూడాలని ఆయన ఆదేశించారు.

## నైట్రాప్ కలిపిన విస్కీతో హత్య..!

ఈ విషయాలపై వెంకటేశం భార్య సులోచన గణేష్ ఇంటికి వచ్చి గొడవ చేసేదని తెలిపారు. దీంతో వెంకటేశాన్ని ఎలాగైనా వదిలించుకోవాలని గణేష్ నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో వెంకటేశం భార్యను రూ.లక్ష డిమాండ్ చేశారనే ఆరోపణలపై ఓ నాయకుడిపై కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో వెంకటేశాన్ని హత్య చేసి, సదరు నాయకుడి వేధింపుల కారణంగానే అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించేలా చేయాలనే ఉద్దేశంతో గణేష్ కుట్ర పన్నినట్లు వెల్లడించారు. లక్ష్మణ్ అనే వ్యక్తికి సదరు నాయకుడితో విభేదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. దీంతో కేసులో రాజకీయ కోణాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి కుసుమ గణేష్‌తో పాటు మరికొందరు వ్యక్తులు లక్ష్మణ్‌కు సన్నిహితులుగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లక్ష్మణ్, పోసు రమేష్, పసునూరి సూర్య ప్రకాష్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని వెంకటేశం హత్యలో వారి ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నారు.

బట్టల డయ్యింగ్‌లో ఉపయోగించే నైట్రాప్ పొడి విషపూరితమని గణేష్‌కు తెలుసని పోలీసులు తెలిపారు. వెంకటేశంతో కలిసి మద్యం సేవించే అలవాటు ఉండటంతో.. నైట్రాప్‌ను విస్కీలో కలిపి తాగిస్తే హత్య చేయవచ్చని భావించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 6న ఉదయం ఇంట్లో ఉన్న ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్‌లో నైట్రాప్ పొడిని కలిపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వెంకటేశానికి ఫోన్ చేసి మద్యం తాగేందుకు రమ్మని పిలిచాడు. నైట్రాప్ కలిపిన ఎంసీ విస్కీ బాటిల్‌తో పాటు మరో మాన్షన్ హౌస్ క్వార్టర్ బాటిల్, రెండు వాటర్ ప్యాకెట్లను తీసుకుని ఆర్టీసీ బస్సులో రగుడు శివారుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ వెంకటేశంతో కలిసి మద్యం సేవించాడు. నైట్రాప్ కలిపిన విస్కీని వెంకటేశంతో తాగించిన కొద్దిసేపటికే అతడు కిందపడిపోయాడని, వెంకటేశం మృతి చెందాడని భావించిన గణేష్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. కుసుమ గణేష్ వద్ద నుంచి మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, నైట్రాప్ విషపదార్థం, ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్, నిందితుడి దుస్తులు, క్యాప్, మృతుడికి సంబంధించిన పేపర్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు బి. రవికుమార్, ఎన్. శ్రీనివాస్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అర్హులైన పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని అనేక మంది ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనీ ఎమ్మెల్యే మదన్ మోహన్ మంత్రికి వివరించారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకాశం దక్కని అర్హులైన నిజమైన లబ్ధిదారులకు కూడా అవకాశం కల్పించేలా అదనంగా 2,000 ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పొందిన లబ్ధిదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను, నిర్మాణ దశలకు అనుసంధానమైన విడతల చెల్లింపులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. నిధులు సకాలంలో అందితే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే మదన్ మోహన్ విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి అదనంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

### మహంకాళి అమ్మవారికి

## మారు బోనం సమర్పించిన కొండా సురేఖ

బోనమెత్తిన మహిళలకు ఈ సందర్భంగా మంత్రి సురేఖ చీరె, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారు బోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆషాఢ బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారం కూడా తోడవడంతో బోనాల ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయని ఆమె అన్నారు.



## తగలబడిన స్కూల్ బస్

పిల్లల అరుపులు విన్న స్థానికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా మంటల్లో చిక్కుకున్న బస్సు వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్లారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బస్సులోకి చేరుకుని ఒక్కొక్కరుగా విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. స్థానికుల సాహసోపేత చర్యలతో 25 మంది విద్యార్థులను సురక్షితంగా రక్షించారు. అయితే కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో విద్యార్థుల్లో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. ఈ స్కూల్ బస్సు జైసల్మేర్ పబ్లిక్ స్కూల్ కి చెందినదిగా సమాచారం. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన బోధన

## జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ కళాశాల అధ్యాపకులకు రెండవ స్పెల్ రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా అధ్యాపకులు బోధనా పద్ధతులను మెరుగుపరుచుకోవాలని అన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ ఈ రెండు రోజుల శిక్షణలో అధ్యాపకులకు బోధనా మెళకువలు, ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తారని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు ఈ



శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించాలని ఆకాంక్షించారు. శిక్షణ తరగతుల్లో ఫిజికల్ సైన్స్, కామర్స్, బయాలజీ, హిస్టరీ తదితర సబ్జెక్టులకు చెందిన అధ్యాపకులు, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ధన్ పాల్ పరామర్శ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇటీవల మృతి చెందిన యువకుడు అజీమ్ కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మంగళవారం పరామర్శించారు. ఆటో నగర్ లోని వారి ఇంటికి వెళ్ళి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబానికి ఆసరాగా నిలిచిన నవయువకుడు మృతి చెందడం బాధాకరమన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇరిగేషన్ శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం, లోతట్టు ప్రాంతాలకు అనుమతించకపోవడం చేయాలన్నారు. ఈ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే బాధిత కుటుంబాలకు తన వంతు సహకారం ఉంటుంది అన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు కైసర్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, రాము, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# చేనేత సహకార సంఘం అధ్యక్షురాలికి ఘన సన్మానం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా చేనేత సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా ఎన్నికైన సీనియర్ సిటిజన్స్ ఫోరం, సుభాష్‌నగర్ కార్యవర్గ సభ్యురాలు గుజ్జ రాజేశ్వరిని ఫోరం సభ్యులు ఘనంగా సన్మానించారు. సుభాష్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఫోరం అధ్యక్షులు కాటిపల్లి నారాయణరెడ్డి శాలువాతో సత్కరించగా, కార్యదర్శి డా. వంగ విజయకుమార్ బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ



సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ, చేనేత సహకార సంఘం అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం గర్వకారణమని, ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ ఫోరంకు గతంలో అందించిన సేవలను కొనసాగిస్తూ, భవిష్యత్తులోనూ ఫోరం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. తనను సన్మానించిన ఫోరం సభ్యులకు గుజ్జ రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఫోరంతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు టి. భూమన్న, నల్లా రాజారెడ్డి, దొంతి లక్ష్మారెడ్డి, కర్ణం వెంకటరెడ్డి, శ్రీరాములు, లింగయ్య, భూమయ్య, రవీంద్రనాథ్, గుజరాతీ రాజేశ్వర్, రంగయ్య, సిద్ధిరాములు, సత్యనారాయణ, సభ్యులు రాజన్న తదితరులు పాల్గొని రాజేశ్వరికి అభినందనలు తెలిపారు.

# చెవి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

## ఈఎన్‌ంంంటి సర్జన్ డా. అలోక్ ఎన్. రాఠి సూచన



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :చెవిలో చీము కారడం, తరచూ చెవి నొప్పి రావడం, వినికిడి తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని మెడికవర్ హాస్పిటల్స్, నిజామాబాద్‌కు చెందిన ఈఎన్ టీ సర్జన్ డా. అలోక్ ఎన్. రాఠి సూచించారు. చెవి సమస్యల కు సకాలంలో చికిత్స తీసుకోక పోతే వినికిడి సామర్థ్యం శాశ్వతంగా దెబ్బ ంతినే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. చెవిలో చీము కారడానికి ఇన్ఫెక్షన్, మధ్య చెవిలో ఇన్ఫెక్షన్, చెవిపొ రలో రంధ్రం వంటి పలు కారణాలు ఉండవచ్చని డా. అలోక్ తెలిపారు. ముఖ్యంగా చెవిలో చీము కారడం పదేపదే జరుగుతున్నా, చెవి నొప్పి తరచూ వస్తున్నా లేదా వినికిడి క్రమంగా తగ్గుతున్నా సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఈఎన్ టి నిపుణుడిని సంప్రదించాలని సూచించారు. చెవిలో చీము కారుతున్న సమయంలో వైద్యుల సలహా లేకుండా నూనె, చెవి డ్రాప్స్ లేదా ఇతర పదార్థాలను ఉపయోగించడం వల్ల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. చెవి సమస్యకు అసలు కారణాన్ని గుర్తించిన తర్వాతే తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. “చెవిలో చీము కారడం చిన్న విషయం కాదు. వినికిడి తగ్గడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. తొలిదశలోనే సమస్యను గుర్తించి చికిత్స అందిస్తే వినికిడి సమస్యలు మరింత తీవ్రం కాకుండా నివారించే అవకాశం ఉంటుంది” అని డా. అలోక్ పేర్కొన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పిల్లలకు తరచూ చెవి ఇన్ఫెక్షన్లు రావడం, చెవిలో చీము కారడం, పిలిచినా స్పందించకపోవడం, టీవీ లేదా మొబైల్ శబ్దాన్ని ఎక్కువగా పెట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పిల్లల్లో వినికిడి సమస్యలను ముందుగానే గుర్తించడం వారి మాటల అభివృద్ధి, చదువు, సాధారణ అభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు. మెడికవర్ హాస్పిటల్స్, నిజామాబాద్‌లో చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలకు అవసరమైన ఈఎన్ టి పరీక్షలు, వినికిడి పరీక్షలు, ఆధునిక డయాగ్నస్టిక్ సదుపాయాలు, అవసరమైన శస్త్రచికిత్సా చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డా. అలోక్ తెలిపారు. అవసరమైన రోగులకు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయు, క్రిటికల్ కేర్, 24 గంటల అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. చెవిలో చీము కారడం, వినికిడి తగ్గడం, చెవి నొప్పి, చెవిలో శబ్దాలు వినిపించడం లేదా చెవి మూసుకుపోయినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా ఈఎన్ టి నిపుణుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని డా. అలోక్ సూచించారు.

# ఫీజు బకాయిల పేరుతో టిసీలు నిలిపివేయొద్దు

## ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల టి.సీ. (ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్), ఇతర విద్యా ధ్రువపత్రాలను నిలిపివేయడం, టి.సీ. జారీకి అదనపు రుసుములు వసూలు చేయడం వంటి ఆరోపణలపై నిజామాబాద్ నగరంలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గంగాస్థాన్ ప్రాంతంలోని ఎస్సార్ కళాశాలతో పాటు మరికొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అధిక ఫీజుల వసూళ్లు, తగిన ఫ్యాకల్టీ లేకపోవడం, విద్యా మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా టి.సీ. జారీకి రూ.200 చార్జీ



పేరుతో రుసుము డిమాండ్ చేయడం, ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, నిజామాబాద్ జోనల్ కన్వీనర్ సందు ప్రవీణ్, ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.ఎన్. వర్మ, రూరల్ అధ్యక్షుడు యాటకర్ల దేవేష్ తదితరులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలిసి ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు. ఫీజు సంబంధిత వివాదాల కారణంగా విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు ఇబ్బంది కలగకుండా, టి.సీ., విద్యా ధ్రువపత్రాలు లేదా ఇతర అవసరమైన పత్రాలను నిలిపివేయకుండా కళాశాల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రతినిధులు కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హక్కులు, విద్యా భద్రత, తల్లిదండ్రుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు.

# విఠల నామస్మరణలతో మారుమోగిన లొంగన్ గ్రామం

## బైరాపూర్ విఠలేశ్వర ఆలయానికి భక్తుల పాదయాత్ర

జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామం భక్తి కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఆషాఢమాసం ముగింపు సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈసారి కూడా గ్రామానికి చెందిన భక్తులు బైరాపూర్‌లోని ప్రసిద్ధ విఠలేశ్వర ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. మంగళవారం శంకర్ మహరాజ్, బాలాజీ మహరాజ్, హన్మంత్ మహరాజ్, బల్‌రాం మహరాజ్‌ల ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులు పాదయాత్రను ప్రారంభించారు. భాజా భజంత్రీలు, భజన కీర్తనల నడుమ ప్రారంభమైన యాత్రలో భక్తులు ‘విఠల.. విఠల’ నామస్మరణలు చేస్తూ ముందుకు సాగారు. దీంతో లొంగన్ గ్రామం భక్తి వాతావరణంతో మారుమోగింది. సుమారు 55 కిలోమీటర్ల మేర రెండు రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగనుంది. చిన్న ఎడ్గి, లాడేగాం, ఫత్లాపూర్, బిచ్కుంద, హజ్గుల్ గ్రామాల మీదుగా యాత్ర సాగనుంది. హజ్గుల్ గ్రామంలో భక్తులు రాత్రి బస చేయనున్నారు. బుధవారం బైరాపూర్ చేరుకున్న అనంతరం విఠలేశ్వరుడికి జలాభిషేకం, పుష్పాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పాదయాత్ర ప్రారంభం సందర్భంగా గ్రామ సర్పంచ్ భర్త సదాశివ్ పటేల్, గ్రామ పెద్దలు గ్రామ పొలిమేరల వరకు వచ్చి భక్తులకు వీడ్కోలు పలికారు. ఈ యాత్రలో నామ్‌దేవ్, శంకర్‌గౌండ, నగల్‌గిద్దె రామ్‌నాథ్, రాజు, కౌరే శంకర్, వడ్ల మారుతి, మాజీ ఎంపీటీసీ విఠల్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# జలసిరి అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## కలెక్టర్ భవేష్ మిశ్రా

### హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై అధికారులతో సమీక్ష

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భూగర్భ జలాలను పెంపొందించేందుకు, వర్షపు నీటిని నిలువ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ తదితర నిర్మాణాలు జరిపించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీఓ లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం జీతాల కోసం పని చేయకూడదని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యతను గుర్తెరిగి అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నైరుతీ రుతుపవనాలు మొట్టమొదటగా ప్రవేశించే కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా సాధారణంతో పోలిస్తే 44 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణకు ఉపయుక్తంగా నిలిచే ఫాంపాండ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని విరివిగా నిర్మించేలా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించక వృధాగా ఉన్న బోరు బావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లాలో వీటి నిర్మాణాల వల్ల 5 నుండి 10 అడుగుల మేరకు భూగర్భ జలాల వృద్ధి చెందాయని, ఇక్కడ కూడా అలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షిన్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కలను ఈ నెల 29న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుండి నిధుల రికవరీ చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తూ, సెప్టెంబర్ 15లోపు పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని గడువు విధించారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు వీబీజీరాంజీ కింద వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి కేటాయించబడే నిధులు పూర్తిస్థాయిలో వినియోగం అయ్యేలా చొరవ చూపాలన్నారు. గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసేందుకు లబ్దిదారుల జాబితా రూపొందించాలని, రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేందుకు వీలుగా లబ్దిదారుల జాబితాను తక్షణమే తహసిల్దార్లకు సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఫాంపాండ్స్, సోక్ పిట్ల నిర్మాణాలు చేపట్టేలా, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను, ప్రజలను అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈ.ఈలు, ఏ.ఈలు తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పనకు ఖచ్చితమైన సమాచారం అందించాలి

## అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీ.సీ.హెచ్.బీ) రూపకల్పన కోసం ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సమాచారం అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో, ఆయా రంగాల ప్రముఖులతో జనగణన--2027కు సంబంధించి జిల్లా స్థాయిలో రూపొందించే హ్యాండ్‌బుక్ కు అందించాల్సిన సమాచారం విషయమై చర్చించి సూచనలు చేశారు. విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, చేతివృత్తులు, కళలు, సాహిత్యం, ప్రముఖ వ్యక్తులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, పరిశ్రమలు, పురావస్తు సంపద తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రాబోయే పది సంవత్సరాల పాటు సమాచార సేకరణ, ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయుక్తమైన గ్రంథంగా నిలుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సమాచార సేకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారం రోజులలో సంబంధిత శాఖలు సమాచారాన్ని సేకరించి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం ఇష్టం లేదు...కానీ తప్పలేదు

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాన్సువాడ, బతుకమ్మ :కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం తనకు అస్సలు ఇష్టం లేదని, కానీ పరిస్థితుల ప్రభావంతో తప్పలేదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 6 మాసాలలో బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబితేనే జాతీయ కండువా కప్పుకున్నానన్నారు. అభివృద్ధికి సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెబితేనే తాను పార్టీలో చేరానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూరు చెక్ డ్యాం వద్ద నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పోచారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను మంత్రి పదవి కోసమో, డబ్బుల కోసమో కాంగ్రెస్ పార్టీలో చేరలేదని.. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి మాటలు మంత్రులు వినడం లేదని..సీఎం స్వయంగా మంత్రులకు నిధులు మంజూరు చేయమని చెప్పినా మంత్రులు సీఎం మాటలు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు సీఎం మాటలు వినడం లేదని పోచారం వాపోయారు. వేం నరేందర్ రెడ్డికి స్వయంగా ముఖ్యమంత్రి చెప్పినా పట్టించుకోవడం లేదు. వేం నరేందర్ రెడ్డి కి 50 సార్లు ఫోన్ చేసినా ఫోన్ అటెండ్ చేయడం లేదు. అప్పటి రాజకీయ పరిణామాల వల్ల కొంతమంది దౌర్భాగ్యులు చేసిన పని వల్ల పార్టీ మారాల్సి వచ్చిందన్నారు.

# రైలులో భారీగా గంజాయి స్వాధీనం

## నిందితుల కోసం గాలింపు



కామారెడ్డి, బతుకమ్మ :నాగవల్లి ఎక్స్ ప్రెస్ రైలులో అక్రమంగా రవాణా చేస్తున్న 6 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్, రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, కామారెడ్డి జిల్లా మధ్యనిషేధ అధికారి ముకుందరెడ్డి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. పక్కా సమాచారంతో కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, జిల్లా టాస్క్ ఫోర్స్, రైల్వే పోలీసులతో కలిసి సంయుక్తంగా సంబల్‌పూర్ నుండి నాందేడ్ వెళ్లే నాగవల్లి ఎక్స్ ప్రెస్‌లో దాడి చేశారు. ఈ దాడుల్లో 6 కిలోల ఎండు గంజాయి దొరికినప్పటికీ, నిందితులు ఎవరూ పట్టుబడలేదు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, డీటీఎఫ్ సీఐ సుందర్‌కృష్ణసింగ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు అనిల్, మధులతో పాటు సిబ్బంది జాన్, ఫరీద్, శ్రీనివాసరావు, శరత్ కుమార్, అమృత్‌రెడ్డి, శంకర్, పవన్, నర్సింలు, శరత్, దినేష్, రాజు పాల్గొన్నారు.

# భార్య భర్తల ఆత్మహత్య

## ఉరివేసుకొని ఒకరు.. నిద్రమాత్రలు మింగి మరొకరు

## కుటుంబ కలహాలు.. ఆర్థిక ఇబ్బందులే కారణమా ?



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా కేంద్రం లో కరెంట్ ఉద్యోగి ఒకరు, భార్య తో కలిసి ఆత్మహత్య కు పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళ వారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏర్గట్ల మండల కేంద్రం కు చెందిన శేషాల నరేష్ (40) విద్యుత్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. జిల్లా కేంద్రం లోని ఈఆర్ఓ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్నాడు. నరేష్ తన భార్య మేఘన (32) తో మంగళవారం ఉదయం నిజామాబాద్ నగరం లోని బైపాస్ రోడ్ లోని అద్దె ఇంటిలో గొడవ పడ్డారు. దానితో ఆవేశం లో నరేష్ ఉరివేసుకోగా , భార్య మేఘన స్లీపింగ్ పిల్స్ సేవించింది. ఇద్దరు ఆపాస్మరక స్థితి లో ఉండగా స్థానికశీగా కుటుంబ సభ్యులు ఆసుపత్రి కి తరిలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు. నరేష్, మేఘన దంపతులకు 6,8 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నట్టు తెలిసింది. ఇద్దరి ఆత్మహత్య ఆర్థిక ఇబ్బందులు, కుటుంబం కలహాలు కారణం అని తెలిసింది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# ఎల్లారెడ్డి నిరుద్యోగ యువతకు శుభవార్త

## ఆగస్టు 24న మెగా జాబ్ మేళా

ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో “మెగా జాబ్ మేళా--2026” నిర్వహించనున్నారు. ఈ నెల 24వ తేదీ సోమవారం ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్ మేళా జరగనుంది. ఈ మెగా జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయి. సుమారు 5,000 మంది నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. జాబ్ మేళాలో బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఐటీ ఌ బీపీఓ, సేల్స్, మాన్యుఫ్యాక్చరింగ్, ప్రైవేట్ ఉద్యోగాలు తదితర రంగాలకు సంబంధించిన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. ఫ్రెషర్స్ తో పాటు ఇప్పటికే అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని నిర్వాహకులు పేర్కొన్నారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం వచ్చే రిఫరెన్స్ నెంబర్ ను స్క్రీన్‌షాట్ తీసుకోవడం లేదా నోట్ చేసుకుని భద్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో రిఫరెన్స్ నెంబర్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది





## ఏఐకేఎంఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు ఆకుల పాపన్న

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐకేఎంఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు ఆకుల పాపన్న ఆరోపించారు. నగరంలోని కోటగల్లిలోని ఎన్.ఆర్. భవన్‌లో అగ్గు ఎర్రన్న అధ్యక్షతన మంగళవారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నిజామాబాద్ డివిజన్ 5వ మహాసభ నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు అగ్గు ఎర్రన్న ఏఐకేఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆకుల పాపన్న మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా పేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర ఉందని, నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు దేశంలోని పీడిత ప్రజలకు దిశానిర్దేశం చేసిన పోరాటాలని పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా నదుల ద్వారా సుమారు 2 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోందని, దీంతో 60 వేల ఎకరాలకు సాగునీరు అందక భూములు బీడుగా మారుతున్నాయని పాపన్న ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ, దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలకవర్గ పార్టీలకు రైతాంగం పట్ల చిత్తశుద్ధి లేదనీ, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని బోధన్ చక్కెర కర్మాగారాల భూముల పరిరక్షణలో ఏఐకేఎంఎస్ పోరాటం కీలక పాత్ర పో షించిందని తెలిపారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి మాట్లాడుతూ, నగరానికి సమీపంలో ఉన్న సారంగాపూర్ ఎన్‌సీఎస్ఎఫ్ చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభించి, బెల్లం తయారీ కేంద్రంగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల రైతులు, వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మహాసభలో దేవదత్ బన్నీ, జే.పీ. గంగాధర్, చిన్నయ్య, గోపాల్, బి. దేవస్వామి, ముత్యాల నారాయణ, రాపాని గంగాధర్, బి. సాయిలు, కొరటిపల్లి గంగాధర్, సుమన్, సరోజన, నరసవ్వ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పాత నేరస్థులపై నిఘా పెంచాలి

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు పోలీసులు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నమోదైన హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, పేకాట, గుట్కా అక్రమ వ్యాపారం తదితర కేసులపై కమిషనర్ సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన నిందితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. పేకాట, గుట్కా, ఇసుక అక్రమ రవాణా, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించి, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లుగా గుర్తించడంతో పాటు అవసరమైన చోట్ల సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హైవేలను కలుపుతున్న లింక్ రోడ్ల వద్ద అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ఇంజనీరింగ్‌లో లోపాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి నేషనల్ హైవే, స్టేట్ హైవే అధికారులు, ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వినియోగించుకునే డయల్ 112 సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఈ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా పోలీసులు నిరంతరం కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని, వాహనాల తనిఖీలను 24 గంటలూ కొనసాగించాలని తెలిపారు. వాహనాల తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌లో విద్యార్థులపై వార్డెన్ దాడి

కర్రతో కొట్టినట్లు విద్యార్థుల ఆరోపణలు..

శరీరాలపై దెబ్బల గుర్తులు

ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని

తల్లిదండ్రుల డిమాండ్



బాన్సువాడ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులపై వార్డెన్ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హాస్టల్ వార్డెన్ కల్పలత తమపై కర్రతో దాడి చేసినట్లు సుమారు పది మంది విద్యార్థులు ఆరోపించారు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినప్పటికీ వార్డెన్ వినకుండా కర్రతో ఇష్టానుసారంగా కొట్టినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థుల శరీరాలపై దెబ్బల గుర్తులు కనిపించినట్లు సమాచారం.

**తల్లిదండ్రుల్లో ఆందోళన**

హాస్టల్‌లో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌ను పరిశీలించాలని కోరుతున్నారు. విద్యార్థులపై దాడి జరిగిందన్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మద్నూర్ మండల ఉప సర్పంచుల ఫోరం కమిటీ ఏర్పాటు



మద్నూర్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం మద్నూర్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ మార్గదర్శకత్వంలో, జిల్లా అధ్యక్షులు దుంపటి రాజు ఆదేశాల మేరకు, జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షులు బొమ్మల నాగరాజు ఆధ్వర్యంలో మద్నూర్ మండల ఉప సర్పంచుల ఫోరం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల దుర్గ నరేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు పూజారి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు బొమ్మల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ, గౌరవం, అధికారాల సాధనే తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి మండలంలో బలమైన కమిటీలను ఏర్పాటు చేసి ఉప సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం సమష్టిగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మండల గౌరవ అధ్యక్షులు క్యాతం వార్ మహేష్ మాట్లాడుతూ ఉప సర్పంచుల చెక్ పవర్ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలాఫలకాలపై సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచుల పేర్లను కూడా తప్పనిసరిగా పొందుపరచాలని కోరారు. ఉప సర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, ఉప సర్పంచులకు వైస్ చైర్మన్ హోదాతో పాటు సర్పంచ్‌తో సమానంగా సంతకం చేసే అధికారాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ, మండల స్థాయి అధికారిక కార్యక్రమాలకు ఉప సర్పంచులను కూడా గౌరవ అతిథులుగా ఆహ్వానించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మద్నూర్ మండల ఉప సర్పంచుల ఫోరం కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా క్యాతం వార్ మహేష్ (రుసేగావ్), ఉపాధ్యక్షుడిగా ఎం.డి. ఫక్రు (షేఖపూర్)లను నియమించారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండలంలోని ఉప సర్పంచులు, ఫోరం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను తగ్గించాలి

## డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను తగ్గించేందుకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి, నివారించగల ప్రతి ప్రాణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ బి. రాజశ్రీ అధ్యక్షతన ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం తమ వైద్య పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణీలు, చిన్నారుల్లో కనిపించే ప్రమాదకర లక్షణాలను ముందుగానే గుర్తించి, అవసరమైన సందర్భాల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయాలని తెలిపారు. బాలింతలను క్రమం తప్పకుండా వారి ఇళ్ల వద్ద ఫాలోఅప్ చేయాలని, ప్రతి గర్భిణీ, బాలింతకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసవం అనంతరం తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు అందించే ప్రాముఖ్యతను వివరించాలని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తల్లి ఇంటికి వచ్చే వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి వివరాలను మదర్ ఇన్, మదర్ ఔట్ విధానంలో పరస్పరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. తద్వారా ఫాలోఅప్ సేవలను సక్రమంగా కొనసాగించి, ప్రమాదంలో ఉన్న తల్లులు, శిశువుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. గర్భిణీలు పొగాకు, మద్యం వంటి హానికర అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని, మూఢనమ్మకాలను తొలగించాలని అన్నారు. ఎంసీహెచ్ కార్డులో సూచించిన అంశాలను తప్పనిసరిగా పాటిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాల విరామం ఉండేలా కుటుంబ నియంత్రణపై విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన ఐయూసీడీ, అంతర ఇంజక్షన్, పీపీఐయూసీడీతో పాటు అవసరమైన వారికి శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. గత రెండు సంవత్సరాల ప్రసవ రికార్డుల ఆధారంగా అర్హులైన మహిళల జాబితాను రూపొందించి వారికి ప్రత్యేకంగా అవగాహన, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. గర్భిణీలకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత, బరువు పెరుగుదల, రక్తపోటు తదితర అంశాలను పరిశీలించాలని అన్నారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణీలను గుర్తించి వెంటనే ఉన్నత ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అంబులెన్స్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ తదితర ప్రభుత్వ శాఖల సహకారంతో కుటుంబ నియంత్రణ, తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషణ, ప్రమాదకర లక్షణాల గుర్తింపుపై జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో కోరారు.

### నెలలోపు మరణాల ఆడిట్ పూర్తి చేయాలి

పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలపై ప్రతి నెల 10వ



తేదీలోపు ఆడిట్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత, ముఖ్యంగా ప్రసవం అనంతరం గంటలోపు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణీ స్త్రీల బరువు పెరుగుదలను ప్రతి నెలా సమీక్షించాలని, శిశువులకు ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించే అంశంపై బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్త్రీ వైద్య నిపుణులు మాట్లాడుతూ గర్భిణీలకు రక్తపోటు, హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు తదితర పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, కనీసం నాలుగు సార్లు వైద్యులచే పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించడం, తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి బరువు పెరుగుదలపై పర్యవేక్షణ, కుటుంబ నియంత్రణ పద్ధతుల వినియోగం, అంబులెన్స్ సేవలను సకాలంలో వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఐఓ డాక్టర్ ఎం. అశోక్, స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అరుణ రేఖ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నవీన్, డాక్టర్ సుస్మిత, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రవీందర్, డాక్టర్ విద్య, డాక్టర్ సికందర్ నాయక్, డీఎస్ఓ డాక్టర్ వెంకటేష్, డాక్టర్ నవ్య, సీడీపీవోలు రాంబాబు, డీహెచ్ఈలు గన్పూర్ వెంకటేశ్వర్లు, మనోహర్, డీడీఎం పృథ్వీ, వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సమీక్షలో పోచంపాడు, నందిపేట్, రెంజల్, బినోల, సీఎస్ కాలనీ, రుద్రూర్, జక్రాన్‌పల్లి, ముదక్పల్లి, వేల్పూర్, మోస్రా తదితర 10 పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరును సమీక్షించారు.

# విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

## మున్సిపాలిటీ చైర్మన్ రమేష్ షట్కర్



బిచ్కుంద, బతుకమ్మ :చదువు లేనిదే జీవితంలో అభివృద్ధి సాధ్యం కాదని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మున్సిపాలిటీ చైర్మన్ సీమా రమేష్ షట్కర్ సూచించారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ చైర్మన్ సీమా రమేష్ షట్కర్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ప్రేమ్ సేటు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లా డుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్య త్తులో మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కార్తీక్ ధర్పల్లి, నౌషా నాయక్, కుర్కటే శ్యామల, మహమ్మద్ ముజా హిద్, షేక్ గులాం, సైముద్దీన్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు చింతల హనుమాన్లు, బొగడ మేతాన్ భాయ్, సాయిలు, షేక్ అసాద్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం

## డీపీఈఓ అరుణ్ కుమార్

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని నిజామాబాద్ డీపీఈఓ అరుణ్ కుమార్ తెలిపారు. ఆగస్టు 1 నుంచి ఇప్పటివరకు డీపీఈఓ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, భీంగల్, మోర్తాడ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలు, దాడుల్లో మొత్తం 40 కేసులు నమోదు చేసి, 20 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో 10 లీటర్ల గుడుంబా, 11 లీటర్ల ఎన్ డీపీఎల్, 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా 20 కల్లు శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం పంపించినట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో బదిలీలు సర్వసాధారణమని, బదిలీల కారణంగా విధులు, తనిఖీలు నిలిపివేయడం జరగదని అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. గత వారం సమర్థవంతంగా పని చేశామని, రాబోయే వారంలో మరింత విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలను వినియోగించే వారు, విక్రయించే వారు, అక్రమంగా రవాణా చేసే వారిపై ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటికే అక్రమ కార్యకలాపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్ శాఖ సహకారం కూడా కోరుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పనిచేస్తూ, మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేసి సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు సాగుతామని డీపీఈఓ అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

# జీనోమ్ వ్యాలీలో యామ్జెన్ అత్యాధునిక పరిశోధన కేంద్రం

హైదరాబాద్, బతుకమ్మ :గ్లోబల్ బయోటెక్నాలజీ దిగ్గజ సంస్థ యామ్జెన్ తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వంతో మంగళవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చు కుంది. సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో యామ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబుతో సమావే శమైన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా సంస్థ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న



పరిశోధన కేంద్రం ద్వారా స్థానిక ప్రతిభావం తులకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. ఇటీవల యామ్జెన్ 3 వేల మంది ఉద్యోగులతో అతిపెద్ద గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఔషధ రంగంలోని దిగ్గజ సంస్థలు తెలంగాణపై అపార విశ్వాసం చూపించడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు. లైఫ్ సైన్సెస్ రంగానికి తెలంగాణ ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. యామ్జెన్‌లో ఉద్యోగ నియామకాల సందర్భంగా రాష్ట్రంలోని యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్‌లో కొత్త పరిశోధన కేంద్రం ఏర్పాటు ద్వారా తెలంగాణలో లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాలకు మరింత ఊతం లభించనుంది. ఎంఓయూ కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఈడీ శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు

# ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానం

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

జక్రాన్‌పల్లి, బతుకమ్మ :ప్రజల భద్రత కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానమని నగర పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. మన ఊరు -- మన భద్రత -- మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా జక్రాన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 25 సీసీ కెమెరాలను సీపీ మంగళవారం సాయంత్రం జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సీసీ కెమెరాల ద్వారా సులభంగా గుర్తించి, అవసరమైన సందర్భాల్లో తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని కమిషనర్ వివరించారు. ట్రాఫిక్ నియంత్రణలో కూడా సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ భద్రతను బాధ్యతగా తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ సూచించారు. జక్రాన్‌పల్లి గ్రామంలో 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ శాఖకు సహకరించిన గ్రామ పంచాయతీని ఆయన అభినందించారు. అలాగే గ్రామంలో డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. సైబర్



నేరగాళ్ల మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, సీసీఆర్‌బీ ఏసీపీ గురు నాయుడు, డిచ్‌పల్లి సీఐ తిరుపతి, జక్రాన్‌పల్లి ఎస్ఐ మహేష్, గ్రామ సర్పంచ్ బండి పద్మ సత్యం, మండల అధ్యక్షుడు రెక్కల సురేష్‌తో పాటు గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్నింగ్ ఇచ్చినా 'ఆ నలుగురు' మారడం లేదు

### డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు

### పోలీస్ బాస్ మాటే వినకపోతే ఎలా ?

### డీజీపీ వ్యాఖ్యల పై పోలీస్ శాఖలో జోరుగా చర్చ

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో అత్యున్నత పదవిలో ఉన్న డిపార్ట్ మెంట్ హెడ్ (డీజీపీ) సీవీ ఆనంద్ స్వయంగా కొంతమంది అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. పోలీస్ డిపార్ట్ మెంట్‌లో పనిచేస్తున్న నలుగురు ఐపీఎస్ అధికారులు ఎంత చెప్పినా తమ వైఖరిని మార్చుకోవడం లేదని, వీడియో కాన్ఫరెన్స్ లు, టెలికాన్ఫరెన్స్ లలో పలుమార్లు స్పష్టంగా హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడంలేదని ఆయన వ్యాఖ్యానించడంపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. డిజిపీగా సీవి ఆనంద్ బాధ్యతలు స్వీకరించి అప్పుడే వంద రోజులు గడిచిపోయాయి. గతంలో పని చేసిన అధికారులకు భిన్నంగా డిజీపీ పోలిసింగ్ ను పర్యవేక్షణ చేస్తున్నారు. అధికారులు ఎవరు హెడ్ క్వార్టర్ వదిలి హైదరాబాద్ రావద్దని హుకుం జారీ చేసారు. ఈ విషయం కొందరు అదికారులకు రుచించడం లేదు. డిజిపీ ఆనంద్ స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన లు చేస్తూ రాష్ట్రం ను చుట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో అవినీతి, అనైతిక కార్యకలాపాలు చేస్తున్న వారిపై గంటల వ్యవధిలో వేటు వేశారు. అంతే కాకుండా డిపార్ట్మెంట్ హెడ్ లుగా డైరెక్ట్ ఐపీఎస్ లకు పోస్టింగ్ లు కట్టబెట్టారు.. గతంలో మాదిరిగానే ఇన్స్పెక్టర్ క్యాడర్ పోస్టు ఐజీ లకు, డీఎస్పీ, ఎస్పీ, కమిషనర్ పోస్టు డిజిపీ చేపడుతున్నారు. డిజిపీ పోలీస్ శాఖలో చేపట్టిన సరే. సంస్కరణలు కొందరు ముదుర్లకు రుచించడం లేదని సమాచారం.. ఇటీవల డిఎస్పీ బీంరెడ్డి ఎసీబీ కి ఆదాయం కు మించిన ఆస్తులు కేసులో చిక్కడం పోలీస్ బాస్ ప్రెస్టేజీ గా తీసుకున్నట్టు తెలిసింది. కొందరు పోలీస్ శాఖలో పోస్టుల తో కలంకితులు గా మారినట్టు గుర్తించి డైరెక్ట్ వార్నింగ్ ఇచ్చినట్టు తెలుస్తుంది. మరికొందరు పొలిటికల్ సపోర్ట్ ఉందని వసూళ్ల కు తెగబడటం పై పిర్యాదు లు ఉన్నట్టు సమాచారం. ఇంకా మరికొందరు ముందుకు వెళ్లి అక్రమ కేసులు వ్యవహారం పోలీస్ బాస్ కు న్యాయ వ్యవస్థ ద్వారా కొత్త చిక్కులు తేవడం కూడా మరో కారణం అనే లేకపోలేదు.

ఒకవేళ ఆ నలుగురు అధికారులు ఇప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే వారిపై తప్పకుండా కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ తెగేసి చెప్పారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన శాఖలో ఏకంగా పోలీస్ బాస్ స్థాయిలో ఉన్న అధికారే బహిరంగంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో "ఇంతకూ ఆ నలుగురు ఎవరు?" అనే ఆసక్తికర చర్చ సామాజిక వర్గాల్లో, నెటిజన్లలో తీవ్రంగా ఊపందుకుంది. డిజిపీ సంచలన వ్యాఖ్యలు కేవలం పోలీస్ అధికారుల మధ్య ఉన్న అంతర్గత క్రమశిక్షణకు మాత్రమే పరిమితమైన విషయం కాదని, దీని వెనుక సగటు పౌరుడి రక్షణ, పరిపాలనా యంత్రాంగ బాధ్యత దాగి ఉందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు. పోలీస్ వ్యవస్థలో ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయని ధోరణి ఉంటే.. అది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందే న్యాయంపై, ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఒక శాఖ అధిపతి స్వయంగా హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చిందంటే, సదరు అధికారుల పరిధిలో ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, జవాబుదారీతనం ఏ స్థాయిలో మందగించిందో అర్థం చేసుకోవచ్చు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా నియమావళి దాటే ధోరణి పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సడలించేలా చేస్తుంది. ఇంకా, సాధారణంగా శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు లోపల జరిగే సమీక్షా సమావేశాలకే పరిమితమవుతాయి. కానీ, డీజీపీ స్థాయి అధికారి ఈ విషయాన్ని స్పష్టంగా ప్రస్తావించడం వెనుక డిపార్ట్‌మెంట్‌లో సమూల మార్పులు తీసుకురావాలనే కఠినమైన సంకల్పం కనిపిస్తోందని అంతర్గత వర్గాలు అంటున్నాయి. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని స్పష్టం చేసే క్రమంలోనే ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. గతంలోనూ పనిచేయని లేదా నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్న నేపథ్యం ఉన్నప్పటికీ, అత్యున్నత అధికారి ఆదేశాలనే బేఖాతరు చేసే స్థాయికి ప్రవర్తన చేరితే అది తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగానే పరిగణించాల్సి ఉంటుంది. ఉన్నత అధికారి చెప్పినా వినని పరిస్థితి ఉంటే.. భవిష్యత్తులో అలాంటి అధికారులను ప్రాధాన్యత లేని పోస్టింగ్‌లకు పంపడం లేదా విచారణాధికారులను నియమించి కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ ఘటనతోనైనా పోలీస్ యంత్రాంగంలో జవాబుదారీతనం పెరిగి, బాధితులకు తక్షణ న్యాయం దక్కేలా మార్పు వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి వారైనా చర్యలు తప్పవనే స్పష్టమైన సందేశాన్ని ఈ పరిణామం అందిస్తోంది.

# డిసెంబర్ నాటికి మూడు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు పూర్తి

### పైలట్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని నిర్ణయం

### మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలపై ఉన్నతస్థాయి సమీక్ష

### ఫర్నిచర్ కోసం జైళ్ల శాఖతో సమన్వయం చేసుకోవాలి

### డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్





హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) పై విద్యా కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రతి బుధవారం ఈ పాఠశాలల పనుల పురోగతిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న విద్యా కమిషన్ తాజాగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. సమీక్షలో డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్, తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణపతి రెడ్డితో పాటు ఆరుట్ల, వంగూరు, పోల్కంపల్లి, మంచాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

. . . పనుల పురోగతిపై సమీక్ష

మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలల్లో పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులు సమీక్షించారు. నిర్మాణ పనుల పురోగతి, నిధుల విడుదల, మౌలిక వసతులు, ఫర్నిచర్ తదితర అంశాలపై చర్చించారు. కొన్ని పనులకు సంబంధించిన నిధుల విడుదలలో జరుగుతున్న ఆలస్యంపైనా సమీక్షలో చర్చ జరిగింది. నిధుల సమస్య కారణంగా పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టులోని మూడు పాఠశాలల్లో మిగిలిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత డిసెంబర్ గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

. . . జైళ్ల శాఖ నుంచి ఫర్నిచర్

మూడు పబ్లిక్ స్కూళ్లకు అవసరమైన ఫర్నిచర్‌ను జైళ్ల శాఖ ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లలో ఖైదీలు తయారు చేసే ఫర్నిచర్‌ను టీపీఎస్‌లకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రతి పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ వివరాలతో పూర్తి ఇండెంట్‌ను సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులను నవీన్ నికోలస్ ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల అవసరాలకు అనుగుణంగా డెస్కులు, బెంచీలు, టేబుళ్లు, కుర్చీలు తదితర ఫర్నిచర్ అవసరాలను ముందుగానే గుర్తించి ఇండెంట్ సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాల భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యే సమయానికి ఫర్నిచర్ కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు.

. . . ఎంబీల నమోదులో ఇబ్బందులు లేకుండా చూస్తాం

మూడు టీపీఎస్‌లలో ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించి మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీలు) నమోదు చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణపతి రెడ్డి తెలిపారు. పనుల కొలతలు, రికార్డుల నిర్వహణ, బిల్లుల ప్రక్రియ తదితర అంశాల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు.

. . . సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పాఠశాలల అభివృద్ధి పనుల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సమావేశంలో సూచించారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు, నిర్మాణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి మంచాల, వంగూరు, పోల్కంపల్లి మూడు పబ్లిక్ స్కూళ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని విద్యా కమిషన్ స్పష్టం చేసింది.

# ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామ పరిధిలోని సామ్యా నాయక్ తండాలో మంగళవారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించేలా ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీజ్ పండుగ సందర్భంగా పెళ్లికాని యువతులు వారం రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తూ గోధుమలతో బతుకమ్మలను తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా యువతులు గోధుమలతో తయారు చేసిన బతుకమ్మలను అలంకరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో భారీ ఊరేగింపు చేపట్టారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు, పాటలతో తండా పరిసరాలు సందడిగా మారాయి. ర్యాలీ అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువుకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో నాయక్ రాములు, రవి, బాదావత్ రవి, మహిపాల్, బంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

### గౌడ సంఘం అధ్యక్షుడు సుధనవేని శ్రీనివాస్ గౌడ్



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో ఈ నెల 14న నిర్వహించనున్న గీతన్నల చైతన్య యాత్ర సదస్సును విజయవంతం చేయాలని ఏర్గట్ల మండల గౌడ సంఘం అధ్యక్షుడు సుధనవేని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్గట్ల గ్రామ గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో "అమరుల యాదిలో… గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి" అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 14న తాళ్లరాంపూర్ గ్రామంలో నిర్వహించే గీతన్నల చైతన్య యాత్ర సదస్సుకు ముందు తెలంగాణ తల్లి, శివాజీ విగ్రహం వద్ద నుంచి గీతన్నల చైతన్య రథాన్ని ప్రారంభించి, మండలంలోని అన్ని గ్రామాల గీతా కార్మికులు బైక్ ర్యాలీగా తాళ్లరాంపూర్‌లోని గౌడ సంఘం సమావేశ ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. ఏర్గట్ల మండలంలోని అన్ని గ్రామాల గీతా కార్మికులు, గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గీతా కార్మిక సంఘం అధ్యక్షుడు మేకపోతుల రమణ గౌడ్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్ గౌడ్ హాజరుకానున్నట్లు ఆర్మూర్ డివిజన్ గీతా కార్మికుల అధ్యక్షుడు, తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన కోటగిరి రామా గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి రామా గౌడ్, సుధనవేని శ్రీనివాస్ గౌడ్, పచ్చిమట్ల శంకర్ గౌడ్, రంగు కరుణకర్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, కోలా రమేష్ గౌడ్, రంగు గోవిందు గౌడ్, అన్నెల మురళి గౌడ్, పాకాల ప్రసాద్ గౌడ్, పచ్చిమట్ల ప్రదీప్ గౌడ్, కలకత్తా రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ గీతా కార్మికులు, గౌడ సంఘం సభ్యులు హాజరయ్యారు.

## ఘనంగా బోనాల వేడుకలు



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి సమర్పించే బోనాలను ప్రత్యేకంగా అలంకరించి, విద్యార్థినులు తలపై బోనాలను మోసుకుంటూ పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. బోనాల్లో వేప ఆకులు, పూలు, పసుపు, కుంకుమతో అందంగా అలంకరించడంతో పాఠశాల ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న ప్రత్యేకతను తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలు, పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొంతం వెంకటేశం,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ విద్యతోనే బంగారు భవిష్యత్తుకు పునాది

### పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ దుర్గ



మోర్తాడ్, బతుకమ్మ :పిల్లల బంగారు భవిష్యత్తుకు అంగన్వాడీ విద్య పునాది వేస్తుందని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ దుర్గ అన్నారు. మోర్తాడ్ మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ దుర్గ మాట్లాడుతూ, చిన్నారుల ప్రాథమిక విద్యాభివృద్ధిలో ప్రీస్కూల్ విద్య ఎంతో కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ తదితర మెరుగైన సేవలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్న వయసులోనే పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి, సామాజిక నైపుణ్యాలు, క్రమశిక్షణ పెంపొందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముత్యాల భాజమ్మ రాములు, ఉప సర్పంచ్ సాయి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, అంగన్వాడీ టీచర్ సుజాత, ఆయమ్మ లతతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల నియామకం



మాక్లూర్, బతుకమ్మ :కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాక్లూర్ మండల వ్యాప్తంగా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ అధ్యక్షులను నియమించారు. మండల అధ్యక్షుడు దయాకర్ అధ్యక్షతన మండల వ్యాప్తంగా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి ఏకగ్రీవంగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతి ఒక్క అధ్యక్షుడు గ్రామస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండల స్థాయి పార్టీ కార్యక్రమాల్లో గ్రామస్థాయిలో ఉండే సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ భూరోల్ల అశోక్ , సర్పంచ్, వెంకటేశ్వరరావు, సర్పంచ్ మహేష్,సర్పంచ్ రవి,ఉప సర్పంచ్ వినోద్, సురేష్ యాదవ్,దేవానంద్, రాజేశ్వర్, పురుషోత్తం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ పెత్తనం

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### కాంగ్రెస్ నేతల ఆరోపణ



బడా భీంగల్, బతుకమ్మ :గ్రామ పంచాయతీలో సర్పంచ్‌కు బదులుగా ఉప సర్పంచ్ పెత్తనం సాగుతోందని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు బడా భీంగల్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, గ్రామస్తుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగుల గంగా మోహన్ మాట్లాడుతూ.. సర్పంచ్‌గా గెలిచిన అనంతరం గ్రామంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చి, ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి గెలిచిన తర్వాత వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రధానంగా సొంత ఖర్చులతో గ్రామానికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని, జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గ్రామంలో ప్రజలకు ఏదైనా సమస్య వస్తే సర్పంచ్‌ను కలుద్దామంటే ఆమె అందుబాటులో లేకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అన్నారు. ఎన్నికల సమయంలో 24 గంటలు గ్రామంలోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని చెప్పడంతో నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, గెలిచిన అనంతరం సర్పంచ్ భర్త ఉప సర్పంచ్ హోదాలో పెత్తనం చెలాయించడం ఏమిటని రాగుల గంగా మోహన్ ప్రశ్నించారు. సర్పంచ్ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామపంచాయతీ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రైవేట్ పంచాయతీలకు అడ్డాగా మార్చారని వారు ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు గ్రామస్తులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, రాగుల లింబాద్రి, ఆకుల గంగాధర్, జంగం ప్రభు, రాగుల కిషన్, మాజీ ఎంపీటీసీ వల్లి, ముచ్కూర్ నరేష్, పల్లె మహిపాల్, సూల్ల భూమన్న, అయేటి రవీందర్, గురిజల రాజ గంగారం, దండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



మోర్తాడ్, బతుకమ్మ :మోర్తాడ్ మండల పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రొద్దుటూరు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా పెగడ రాములు, ప్రధాన కార్యదర్శిగా బక్కురి ప్రగతికుమార్ ఎన్నికయ్యారు. మండల అసోసియేట్ అధ్యక్షుడిగా రవిరాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా మాణిక్యమ్మ, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా రేణుకాదేవి ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా గంగాధర్, రజనీకాంత్, మహిళా కార్యదర్శులుగా దీపిక, స్వరూపరాణి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో పాటు సంఘం ప్రాథమిక సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రామేశ్వర్ పల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల ధ్వంసం

### కాపర్ కాయిల్స్, వైండింగ్స్‌ను దొంగిలించిన దుండగులు..




భిక్కనూరు, బతుకమ్మ :భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లి గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ కాయిల్స్ వైండింగ్స్ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఇటీవల వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్ఫార్మర్స్ ను ధ్వంసం చేసి దొంగలు కాయిల్స్ ను కాపర్ వైర్ చోరీ చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ బావుల వద్ద ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించిన అనుమానాస్పదంగా తిరిగిన తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## ఘనంగా బోనాల వేడుకలు

### ఆకట్టుకున్న విద్యార్థినీల నృత్యాలు



బాల్కొండ, బతుకమ్మ :మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బోనాలు సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర పండగ బోనాలు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనమని కొనియాడారు. విద్యార్థులకు బోనాల సంస్కృతి, విశిష్టతను తెలియజేయుటకు ఈ బోనాలు సంబరాలు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నుండి మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయానికి ర్యాలీగా ఆనందోత్సాహాలతో నృత్యాలు, పాటలతో విధుల గుండా ప్రదర్శనని నిర్వహించారు. బాల్కొండ గ్రామపంచాయతీ సర్పంచ్ గాండ్ల రాజేష్ విద్యార్థుల ప్రదర్శనను చూసి విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభని కొనియాడారు. ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రశాంత్, ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి వారం జైలు శిక్ష



ఇందల్వాయి, బతుకమ్మ :డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముఖేష్ అనే వ్యక్తికి వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇంద ల్వాయి ఎస్ఐ సుమలత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద గత వారం రోజుల క్రితం వాహనాల తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ముకేశ్ గాల్డె (28) పట్టుబడ్డాడు. ముఖేడ్, నాందేడ్ జిల్లా ప్రాంతానికి చెందిన ముకేశ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడిని నిజామాబాద్ కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి బాలరాజు నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సుమలత వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, దీని వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ఎస్ఐ సుమలత తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.